కథ

## గోపీకృష్ణ పుట్టగంటి

# గ్రీన్ షర్ట్

ట్రాఫిక్ వలన కారు నెమ్మదిగా వెళ్తోంది. దూరంగా ట్రాఫిక్ లైట్ రెడ్ కలర్‌లో వెలుగుతూ కనిపిస్తోంది. ఐపాడ్‌లో మ్యూజిక్ వింటూ ముందున్న ట్రాఫిక్ ఎప్పుడు క్లియర్ అవుతుందా అని ఎదురుచూస్తున్నాడు వంశీ.

హఠాత్తుగా పక్కనున్న చిన్న గ్యాప్‌లో నుండి ముందుకెళ్ళి ఆగింది ఒక స్కూటీ. వైట్ కలర్ పాంట్ మీద గ్రీన్ కలర్ టీ షర్ట్ వేసుకుని ఉంది ఒక అమ్మాయి. లూజ్‌గా వదిలేసిన జుట్టు కింద వీపు మీద 'డోంట్ స్టేర్' అన్న పదాలు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. నన్ను ఆపే ధైర్యం ఎవరికి ఉంది అన్నట్లు, హెల్మెట్ తల మీద కాక వెనుక సీట్‌కి బిగించి ఉంది. వేసుకున్న డ్రెస్ హైలైట్ చేస్తున్నట్లుంది. ఆ అమ్మాయి కలర్ కాంప్లెక్షన్ మెరుపులాగ మెరిసి, వంశీ కళ్ళలో చిక్కుకుపోయింది.

ఎప్పుడూ ఏ ఆడపిల్లని చూసినా కలగని ఫీలింగ్ ఆ అమ్మాయిని చూస్తే కలిగింది. మనసులో మోగుతున్న జింగిల్ బెల్స్‌ని కట్టడి చేసుకునేంతలో ట్రాఫిక్ కదిలింది.

ఆగి ఉన్న కార్ల మధ్య నుంచి సందు చూసుకుని ముందుకెళ్ళిపోతోంది ఆ అమ్మాయి.

తనకున్న డ్రైవింగ్ స్కిల్‌నంతా ఉపయోగించవలసి వస్తోంది వంశీకి ఆ అమ్మాయిని ఫాలో కావటానికి.

ఒక మంచి ఐ.టి. కంపెనీలో బిజినెస్ అనలిస్ట్‌గా పనిచేస్తున్న వంశీకి, రెండు సంవత్సరాలుగా తల్లిదండ్రుల నుండి ఒత్తిడి ఎక్కువవుతోంది పెళ్ళి చేసుకోమని. ఏదో ఒక వంకతో వాయిదా వేస్తూ వస్తున్నాడు ఇప్పటివరకు. అసలు కారణం మాత్రం మనసుకు నచ్చిన అమ్మాయిని స్వయంగా తనే సెలెక్ట్ చేసుకోవాలనే కోరిక.

సంవత్సరానికి ఆఖరి రోజు కావటంతో అందరూ హాలీడే మూడ్‌తో ఉన్నారు. ఆఫీసులో పని త్వరగా ముగించుకుని బయలుదేరాడు. చెల్లెలు లత, తన ఫ్రెండ్‌తో కలసి ఐమాక్స్ థియేటర్ దగ్గరకు వస్తానని, తనని కూడా డైరెక్టుగా అటే రమ్మనటంతో థియేటర్ దగ్గరకి వెళ్తున్నాడు వంశీ.

అతి కష్టం మీద పరపతి అంతా ఉపయోగించి ముందే మూడు టికెట్లు సంపాదించాడు. ఆ సంగతి ఇంకా చెల్లెలికి చెప్పలేదు సర్‌ప్రైజ్ చేద్దామని.

ఆ అమ్మాయి స్కూటీ కూడా ఐమాక్స్ రోడ్‌లోకి ఎంటరవటం చూసి 'యాహూ' అనుకున్నాడు.

న్యూ ఇయర్ డే కావటం వలన ఎప్పుడూ లేనంత రష్‌గా ఉంది. లోపల పార్కింగ్ నిండిపోయి కార్ల క్యూ బయటవరకు వచ్చింది. ఇలాగయితే లాభం లేదని కారుని రోడ్డు పక్కనే పార్క్ చేసి థియేటర్‌లోకి పరుగెత్తాడు.

టికెట్ కౌంటర్ దగ్గర పెద్ద బోర్డు పెట్టి ఉంది 'హౌస్‌ఫుల్ ఫర్ నెక్స్ట్ టూ డేస్' అని. దాని పక్కన మెట్లమీద కూర్చుని ఎవరికోసమో ఎదురుచూస్తున్నట్లుంది ఆ అమ్మాయి.

ముందు లత సంగతి కనుక్కోవాలి అనుకుని, లత నెంబరు డయల్ చేశాడు వంశీ.

"ఎక్కడున్నావురా? ఇక్కడ నేను ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయాను" అంటోంది లత.

'అమ్మయ్య' అనుకున్నాడు వంశీ.

"ఇక్కడ టిక్కెట్లు దొరకలేదు. నువ్వు వచ్చినా ఉపయోగం లేదు. ఇంటికెళ్ళు. నేను వేరే పని చూసుకుని ఇంటికొస్తాను!"

"నా ఫ్రెండ్ నాతో లేదురా. అక్కడికే వస్తానంది. టికెట్ కౌంటర్ దగ్గర ఎదురుచూస్తూ ఉంటుంది. గ్రీన్ కలర్ టీ షర్ట్ వేసుకుని ఉంటుంది. ఆ అమ్మాయి దగ్గర సెల్ లేదు కానీ, నేను రావటం లేదని చెప్పి, సారీ చెప్పు నా తరఫున"

"అలాగేలే...సీయూ" ఫోన్ కట్ చేశాడు వంశీ. ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు, మాటమాటకీ వచ్చే ఫ్రెండ్స్ కాల్స్ డిస్టర్బ్ చేయకుండా. తన అదృష్టం తలుచుకుంటే, తనకే ఈర్ష్య కలుగుతుంది. తనకి నచ్చిన అమ్మాయి తన చెల్లెలి ఫ్రెండ్ కావటమంటే 'వెదుకుతున్న తీగ కాలికి తగిలినట్లే' అనుకున్నాడు.

నెమ్మదిగా ఆ అమ్మాయి దగ్గరకెళ్ళి పలకరిద్దామనుకున్నంతలో గుర్తుకొచ్చింది, ఆ అమ్మాయి పేరు కనుక్కోలేదని.

"ఎక్స్యూజ్‌మీ... మీరు లత ఫ్రెండ్ కదా" అంటూ పలుకరించాడు ఆ అమ్మాయిని.

బ్లాంక్‌గా చూసింది ఆ అమ్మాయి.

"అదేనండీ.. లత మిమ్మల్ని థియేటర్ దగ్గర ఉండమంటట కదా! హఠాత్తుగా తనకి రావటం కుదరటం లేదని ఫోన్ చేసింది. నేను లత అన్నయ్యను. టికెట్స్ నా దగ్గర ఉన్నాయి. ఇఫ్ యూ డోంట్ మైండ్, యూ కెన్ జాయిన్ మి"

ఒక నిమిషం ఏదో ఆలోచించింది ఆ అమ్మాయి. ఒకసారి వంశీని పై నుంచి కింద దాకా చూసింది. "ఐతే లత రావటం లేదా.. నేను ఉంటే, మీకేమీ ఇబ్బంది లేదు కదా!" అంది.

"ఒక్కడ్నే చూసే కంటే మీరు కూడా ఉంటే, నాకూ కంపెనీ ఉన్నట్లు ఉంటుంది. వెళ్దామా?" అంటూ ముందుకు కదిలాడు.

సీట్లో కూర్చున్నాక "మీరు చాలా ఫాస్ట్‌గా డ్రైవ్ చేస్తున్నారు టూ వీలర్ బాగా అలవాటనుకుంటాను" అన్నాడు వంశీ.

వంశీ వంక చూసి మనస్ఫూర్తిగా నవ్వింది ఆ అమ్మాయి మొదటిసారి. మామూలుగానే మెరిసిపోతున్న మోము, నవ్వుతున్నప్పుడు నాలుగు రెట్లు ప్రకాశవంతమయింది.

ఆ తరువాత వంశీ ఒక రకమైన కోమాలో గడిపాడు కాలం. సినిమాలో ఒక్క ముక్క కూడా వినటం కానీ, చూడటం కానీ చేయలేదు. కొద్దిగా వెనక్కి వాలి స్క్రీన్ నుంచి వచ్చే బెంక్ లైట్ వెలుగులో ఆ అమ్మాయి మొహం చూస్తుంటే... రెండు నిమిషాల్లోనే లైట్లు వెలిగినయ్, ఇంటర్ వెల్ అంటూ...

"అప్పుడేనా?..." అన్నాడు వంశీ అప్రయత్నంగా...

"ఎప్పుడు బయటకి వెళ్దామా, అన్నంత బోరుగా ఉంది... మీకేమో అప్పుడేలాగా ఉందా?" అందా అమ్మాయి.

అసలు సినిమా చూస్తే కదా ఎలా ఉందో తెలిసేందుకు అనుకుని, "ఐతే బయటకెళ్దాము పదండి. కాసేపు కబుర్లు అయినా చెప్పుకోచ్చు. అంటూనే, "ఇంతకీ మీ పేరు కూడా నేను అడగలేదు... నా పేరు వంశీ..." అన్నాడు.

"మౌనిక" అని చెప్పి, "పదండి వెళ్దాం" అంటూ బయలుదేరింది.

టైం ఎనిమిది గంటలవుతోంది. "మీకభ్యంతరం లేకపోతే మనమిద్దరం కలసి ఇంకొన్ని గంటలు గడిపితే, ఈ న్యూ ఇయర్ గుర్తుగా మిగిలిపోతుంది. మీకు వేరే ఎంగేజ్‌మెంట్స్ ఏమీ లేకపోతేనే" ఒప్పుకుంటుందో లేదో అనుకుంటూ అనుమానంగా అడిగాడు.

"థాంక్ యూ" అంది మౌనిక. అంగీకారంగానే భావించాడు వంశీ.

"మీ స్కూటీని ఇక్కడే ఉండనివ్వండి. రేపు తీసుకోవచ్చు. పొద్దుపోతే బాగా చలిగా ఉంటుంది. నా కార్లో వెళ్దాము"

"ఓకే" అని తల ఊపింది.

బయటకి వచ్చి తను కారు ఆపిన ప్రదేశంలో చూసేసరికి అక్కడ కారు కనిపించలేదు వంశీకి. ఒక్కసారిగా గుండె ఆగినంత పనయ్యింది. అసలే కొత్త కారు, కొని నాలుగు నెలలు కూడా కాలేదు, పోయిందా ఏంటి అనుకుని కంగారు పడ్డాడు.

పక్కన పాన్ షాపతను చెప్పాడు "మెరూన్ కలర్ సాంత్రో కదా.. సార్.. ట్రాఫిక్ పోలీసులు గుంజుకెళ్లిండ్రు. చలాన్ కట్టి తెచ్చుకోవాలి"

హతాశుడయ్యాడు వంశీ. 'అయ్యో.. ఇప్పుడెలాగ' అనుకుంటూ ఏమీ చెయ్యటానికీ పాలుపోక కంగారుపడసాగాడు.

మౌనిక తన బాగ్ లోంచి సెల్ తీసి ఎవరికో ఫోన్ చేసింది.

"ఇలా తీసుకెళ్లిన వెహికల్స్‌ని ఘోషామహల్ స్టేడియంలో పెడతారంట. రేపు ఉదయాన్నే వెళ్తే.. అక్కడ చలాన్ కట్టి విడిపించుకోవచ్చు. డోంట్ వర్రీ"

లత ఈ అమ్మాయికి సెల్ కూడా లేదని చెప్పింది ఈ సెల్ ఎలా వచ్చిందబ్బా.. అని అనుకుని కూడా తన సమస్య ముందు ఇంకేమీ ఆలోచించలేకపోయాడు వంశీ.


''కానీ, ఇప్పుడు మనకెలా?" అంటున్న వంశీతో "నో ప్రాబ్లమ్, నా స్కూటీ ఉందిగా" అంది మౌనిక.

పార్కింగ్‌లోంచి స్కూటీ బయటకు తీసుకు వచ్చింది. తనకిచ్చి డ్రైవ్ చెయ్యమంటుందేమో అనుకున్నాడు వంశీ. స్టార్ట్ చేసి, "కమాన్" అన్నట్లు చూసింది మౌనిక. వెనుక ఎక్కక తప్పలేదు వంశీకి.

దారి పొడుగునా అందరూ తననే చూస్తున్నట్లు అనిపించింది వంశీకి. ఆ అమ్మాయికి మాత్రం ఇదేమీ పట్టలేదు."

"ముందు ఏదన్నా రెస్టారెంట్‌కి వెళ్దాము" అంది మౌనిక.

సరేనన్నట్లు తల ఊపాడు వంశీ. కారు పోలీసులు తీసుకెళ్లటం అపశృతిలాగా మదిలో మెదులుతూంటే, నార్మల్‌గా ఉండలేకపోతున్నాడు.



రెస్టారెంట్ బాగా రష్‌గా ఉంది. చాలామంది మనుషులు ప్లేస్ కోసం ఎదురుచూస్తున్నారు. మౌనికని చూడగానే ఆ రెస్టారెంట్ మేనేజర్ ఎదురు వచ్చి, 'రిజర్వ్‌డ్' అని ఉన్న టేబుల్ ఒకటి అరేంజ్ చేయించి వెళ్లాడు.

"మా డాడీ ఈ ఏరియా సర్కిల్ ఇన్‌స్పెక్టర్" తనకిస్తున్న స్పెషల్ ట్రీట్‌మెంట్‌కి కారణం చెప్పింది.

అసలే పోలీసులంటే భయం ఎక్కువ వంశీకి. ఈ అమ్మాయి వాళ్ల నాన్న సి.ఐ. అని తెలియగానే హెడ్‌మాస్టర్ ముందు కూర్చున్న పిల్లవాడిలాగా బిక్క మొహం పెట్టి కూర్చున్నాడు.

వెయిటర్ తెచ్చిన బిల్లు చూసి, డబ్బులివ్వటానికి జేబులో చెయ్యి పెట్టిన వంశీకి మరో షాక్ తగిలింది. జేబులో పర్సు లేదు. స్కూటీ వెనుక కూర్చుని విన్యాసాలు చేస్తున్న సమయంలో జారిపోయి ఉంటుంది.

ఏడుపుమొహం పెట్టిన వంశీని చూసి, సంగతి అర్థం చేసుకుంది మౌనిక. బిల్లు తనే పే చేసి బయటకు నడిచింది. అనుసరించాడు వంశీ.


''ఏమున్నాయి పర్సులో?" అడిగింది మౌనిక.

"డ్రైవింగ్

లైసెన్స్... క్రెడిట్ కార్డ్... కొద్దిగా మనీ..." చెప్తున్నాడు వంశీ.

"రేపు ఒకసారి మా డాడీని కలవండి. ఎఫ్ఐయ్యార్ ఫైల్ చెయ్యటానికి హెల్ప్ చేస్తారు. తెలిసిన వారెవరూ లేక పోత పోలీస్ స్టేషన్లో కంప్లయింట్ ఇవ్వటం కూడా చాలా కష్టం. అది లేకపోతే డూప్లికేట్ డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవడం కష్టమవుతుంది"

సరేనన్నట్లు తల ఊపాడు వంశీ, న్యూ ఇయర్ ఇంత ఛండాలంగా మొదలవుతున్నందుకు తిట్టుకుంటూ.




"ఛీర్ అప్ మాన్.. కాసేపు అలా నెక్లెస్ రోడ్ దగ్గరకి వెళ్లి వద్దామా?" అడిగింది మౌనిక.

అప్పటికల్లా ఉత్సాహమంతా చచ్చిపోయింది వంశీకి. "ఇక ఇంటికెళ్తే పోతుందేమో.. మీకు కూడా లేట్ అవుతున్నట్లుంది" అన్నాడు.

"అదేమిటి? న్యూ ఇయర్ మనిద్దరం కలిసి సెల

## శ్రియ గ్లామర్ సీక్రెట్?

ప్రకృతి వైద్యంలో ప్రధానమైనది వాటర్ థెరపీ అని తెలుసు కదా! ఎవరయినా నీళ్లు ఎంత ఎక్కువగా తాగితే అంత మంచిది అనే సంగతి ఈమధ్య తరచూ వింటూనే వున్నాం. ఈ మాటని అందాల భామ శ్రియ నోటి నుంచి కూడా ఇప్పుడు వినొచ్చు. తను ఇంత అందంగా, నాజూకుగా వుండడంలోని ముఖ్య రహస్యం రోజుకి 5 లీటర్ల నీళ్లు తాగడమేనంటుంది. అలాగే శ్రియ తన బరువుని ఎప్పటికప్పుడు చెక్ చేసుకుంటుందిట కూడా. ఏమాత్రం చిన్న తేడా కనిపించినా మరింత జాగ్రత్త వహిస్తుందిట.



బ్రేట్ చేసుకుందాం అన్నారుగా. ఎలాగూ ఇంకా కాసేపే కదా. నాకేమీ భయం లేదు. రండి!" అని నెక్లెస్ రోడ్ వైపు తీసుకెళ్లింది మౌనిక.

అక్కడ రోడ్ పక్క లాన్‌లో బెంచ్ మీద కూర్చున్నారు ఇద్దరూ. దూరంగా గాలిలో తేలుతూ మ్యూజిక్ వినిపిస్తుంది. డాన్స్ చేస్తూ కుర్రకారు చేస్తున్న కోలాహలం ఇక్కడి దాకా వినిపిస్తుంది.

అర్ధరాత్రి పన్నెండు వరకూ మౌనిక చెప్తున్న మాటల్ని ఆసక్తి చూపిస్తూ విన్నాడు వంశీ. ఆ అమ్మాయి ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ చదువుతుందనీ, ఆరు నెలల క్రితమే, కాంపస్ రిక్రూట్‌మెంట్‌లో ఒక ఐ.టి. కంపెనీలో సెలెక్ట్ అయిందనీ తెలుసుకున్నాడు.

ఒక్కసారిగా కోలాహలం ఎక్కువయింది, పన్నెండు అయిన సూచనగా. హుసేన్‌సాగర్ మీద పేలుతున్న క్రాకర్స్, అందంగా వెలుగుతున్నాయి.

రోడ్ పక్కన ఉంది ఒక ఫ్లోరిస్ట్ షాపు. దాదాపు ఖాళీ అయిపోయి మూసివేయబోతున్నారు. మౌనిక లేచి వెళ్లి ఒక రోజ్ పట్టుకొచ్చింది.

బెంచ్ మీద కూర్చుని ఉన్న వంశీకి ఇచ్చి, "నాకు తెలుసు నీ మనసులో నేనంటే ఇష్టపడుతున్నావని. నాకు నీ అంత ఓపిక లేదు. మగవాడే ప్రపోజ్ చెయ్యాలన్న పట్టింపు కూడా లేదు. అందుకని నేనే నీకు ప్రపోజ్ చేస్తున్నాను. ఇష్టమయితే రేపు మా డాడీ మీ ఇంటికొస్తారు, మీ వాళ్లతో మాట్లాడటానికి...ఓకే..." అంది.

* * *

"అంతే... అప్పటి నుంచి ఇప్పటి వరకు జరిగిన ఏ సంఘటనలోనూ, నా ప్రమేయం లేదు. ఆఖరికి హనీమూన్‌కి ఎక్కడకి వెళ్లాలో కూడా తనే ప్లాన్ చేసింది" చెప్తున్నాడు వంశీ ఫ్రెండ్స్‌తో.

"ఐతే ప్రేమించి పెళ్లి చేసుకోవాలన్న నీ కోరిక రివర్స్‌లో తీరిందన్న మాట" అన్నారు ఫ్రెండ్స్.

"ఎక్కడా.. కనీసం ప్రపోజ్ చేసే అవకాశం కూడా ఇవ్వకుండా మా ఆవిడే ప్రేమించి నన్ను పెళ్లి చేసుకుంది" చెప్పాడు వంశీ.

అటుగా వెళ్తున్న లత వీరి మాటల మధ్యలో కల్పించుకుని "ఆ రోజు మౌనిక కనుక ఆ టీ షర్ట్ వేసుకుని ఉండకపోతే అంతా నేను ప్లాన్ చేసినట్లే జరిగి ఉండేది. జస్ట్ మిస్సయింది" అంది.

"మధ్యలో నీ ప్లానేమిటి?" అడిగారు వంశీ ఫ్రెండ్స్.

"వీడినిలాగే వదిలితే ఇక ఎప్పటికీ పెళ్లి చేసుకోడేమోనని మా ఫ్రెండ్‌ని పరిచయం చేద్దామని, తనని థియేటర్ దగ్గరకి పంపి నేను ఇంటికెళ్లిపోయాను. వీడు ఫోన్ చేసినపుడు నేను ట్రాఫిక్ జామ్‌లో ఉన్నానని మా ఫ్రెండ్ ఒక్కతే ఉందని చెప్పి గుర్తుగా తను గ్రీన్ టీ షర్ట్ వేసుకుని ఉంటుందని వెళ్లి పలకరించమనీ చెప్పాను"

"అసలు మా చెల్లెలి ఫ్రెండ్ ఎవరో కూడా నేను చూడలేదు. గ్రీన్ టీ షర్ట్ చూసి, మౌనికని పలకరించాను. అంతే... ఆ తరువాత ఇంతవరకూ మరలా మాట్లాడే అవకాశం కూడా దొరకలేదు" చెప్తున్నాడు వంశీ.

ఇంతలో బయటి నుండి గ్రీన్ టీ షర్ట్ వేసుకుని వచ్చింది మౌనిక. అందరికీ హాయ్ చెప్పి లోపలకి వెళ్లింది. వెళ్తున్న మౌనిక టీ షర్ట్ మీద 'ఫాలో...మీ' అని రాసుంది. మాట్లాడిస్తున్న వారినెవరినీ పట్టించుకోకుండా ఫాలో అయిపోతున్న వంశీని, అందరూ నోరు తెరచుకుని చూస్తూ నిలబడ్డారు. ○